## 12

# “మీరు దేవుని సైన్యంలోనున్నారు!”

## (ఎఫెసీయులకు 6:10-20)

నా పద్దెనిమిదవ పుట్టినరోజును నేనెన్నడూ మర్చిపోలేను. ఆ రోజు నేను అలబామా లోని యూఎస్ సెలక్టివ్ సర్వీస్ కార్యాలయానికి వెళ్ళాను. ఆ రోజునే యవ్వనస్థులు అమెరికా సైన్యంలో చేరే ప్రక్రియలో భాగంగా నా పేరును నమోదు చేయించుకున్నాను నా నమోదు వివరాలున్న ఆ కార్డు వియత్నం యుద్ధ సమయంలో కొంతమంది అమెరికన్లు అత్యవసర సమయంలో యవ్వస్థులు సైన్యంలో చేరాలన్న ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా తమ కీయబడిన నమోదు కార్డులను వాడుకున్నారు. అటువంటి వారు యుద్ధంలో చేరేందుకు ఇష్టం లేక తమకియ్యబడిన కార్డులను కాల్చివేసారు. అలా చేయడం దేశద్రోహంగా పరిగణించబడింది. ఎందుకంటే ఒక పౌరుడు తన దేశంలోని ఆధిక్యతలను, వనరులను అనుభవిస్తునప్పుడు ఆ దేశానికి ఖచ్చితంగా అవసరమగు సమయంలో సేవ చేయాలి. దేశపు ఆధిక్యతలను ఆనందిస్తూ దేశానికి సేవచేయడానికి ఇష్టపడని వారు స్వార్థప్రియులే!

తమ దేశ భద్రతను కాపాడుకోవడానికి సైనికులుగా పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియ ఎంతో ప్రాచీనమైనది. ఈ విధానం ద్వారా ఎన్నో దేశాలు తమ హక్కులను, స్వేచ్ఛను కాపాడుకుంటున్నాయి. అలాగే ఇశ్రాయేలు దేశం కూడా తమ సైన్యాన్ని పటిష్టపర్చుకునేందుకు “పరాక్రమశాలురను” సైన్యంలోకి పంపింది (చూడండి 1 దినవృత్తాంతములు 7:40).

ఇలా నమోదు చేయించుకునే నిబంధనలు ఇప్పుడు అమెరికాలో మారిపోయాయి. ఇప్పుడు ఈ నమోదు ప్రక్రియలో ఇష్టమైన వారు తమకు తాముగా నమోదు చేయించుకుంటున్నారు. అంటే సైన్యంలో చేరేందుకు ఎవరినీ ప్రభుత్వం బలవంతపెట్టడం లేదు. ఇప్పుడు సైన్యం, నావికాదళం, వాయుసేన మరియ సముద్రతీర గస్తీ వారు తమ ఇష్ట ప్రకారం స్వచ్ఛందంగా చేరుతున్నారు కాబట్టి ఇలా స్వచ్ఛంధ సైనికుడు ఎంతోబలమైనవాడు - తన కర్తవ్యం ఎంతో కష్టమైనదని ఎరిగి ప్రతి ఒక్కరూ చేరుతున్నారు.

ఇప్పటి వరకూ భూమ్మీదనున్న సైన్యాల్లో అమెరికా దేశపు సైన్యమే మంచి పోరాట పటిమ గల సైన్యంగా చెప్పబడుతున్నా మరో సైన్యం దీనికంటే బలమైనది అన్ని విధాల శక్తివంతమైనది. మరోటి ఉంది. మీరు క్రైస్తవలైనప్పుడు మీరు దేవుని సైన్యంలో నమోదు చేయబడ్డారు. క్రైస్తవులు “పరలోకమందు వ్రాయబడియున్నారు” అని వాక్యం చెప్తుంది (హెబ్రీయులకు 12:23). ఇది వరకు ఇశ్రాయేలు వారు సైన్యంలో చేర్చుకునేందుకు “పరాక్రమశాలురను” ఎన్నుకున్నట్టే ఇది కూడా ఇటువంటిదే! చీకటిని విడిచి వెలుతురులోకి రావడం ద్వారానే క్రైస్తవులు పోరాటంలో అడుగిడుతున్నారు. సైన్యంలో చేర్చబడిన సైనికునివలె క్రైస్తవుడు క్రమశిక్షణ కలిగియుండాలి (చూడండి 2 తిమోతి 2:3, 4).

దేవుని సైన్యంలో మన విధుల గురించి ఎఫెసీయులకు 6:10-20 తెలియజేస్తుంది. మీరిప్పుడు క్రైస్తవులు. మీరు వెలుగు మరియు చీకటి మధ్య యుద్ధంలో ఉన్నారు (యోహాను

3:19, 20). లోకంలోని ప్రతి ఒక్కరూ వెలుగు సంబంధ సైనికునిలా లేదా చీకటి సంబంధ సైనికునిలా ఈ యుద్ధంలో భాగస్థులైయున్నారు. మీరు క్రైస్తవులైనప్పుడు చీకటి సంబంధ సైనికుని నుండి మారిపోయి వెలుగు సంబంధ సైనికునిలా మిమ్మల్ని మీరు నమోదు చేయించుకున్నారు. మనం దేవుని సైన్యంలో సైనికుల్లా పోరాడాలని వాక్యం మనల్ని కోరుతుంది.

## యుద్ధము

ఎఫెసీయుల పత్రిక అంతయూ క్రైస్తవ జీవితం గురించిన వివరాల్ని పౌలు దైవావేశితుడై అందిస్తున్నాడు. క్రైస్తవుడు ఎలా ఉండాలన్న విషయమై అతడు ఎన్నో దృష్టాంతములను ఇచ్చాడు. క్రైస్తవుడు …

- క్రీస్తు శరీరంలో అవయవమైయున్నాడు (1:22, 23).
- పాపపు మరణం నుండి తప్పించే పునరుత్థాన జీవితాన్ని కలిగియున్నాడు (2:1–10).
- దేవుని ఆలయంలో ఒక భాగమైయున్నాడు (2:19–22).
- దేవుని జ్ఞానము ప్రదర్శించువాడు (3:10).
- సంఘం ఎదుగుదలకు తోడ్పడే నిర్మాణపు భాగం (4:16).
- దేవునిచే పునఃనిర్మించబడిన నిర్మాణం (4:17–32).
- క్రీస్తు వధువులో ఒక భాగం (5:22–32).

క్రైస్తవ జీవితమంటే ఏమిటో మరో దృష్టాంతాన్ని 6:10–20లో చూస్తున్నాము. ఆఖరి దృష్టాంతము క్రైస్తవ జీవితాన్ని యుద్ధరంగంలో నున్న సైనికునితో పోల్చుతుంది. అతడు అంధకార సంబంధులగు దురాత్మలతో పోరాడుచున్నాడు (12వ వచనం). క్రీస్తును అనుసరించువాడు ఒక పోరాటంలో ఉన్నాడని ఇది సూచిస్తుంది. దేవుని ధన్యులైన పిల్లలుగా, మీరు ఆయన సంఘ నిర్మాణ ప్రణాళికలో భాగమైయున్నారు. అలాగే మీరు కఠిన యుద్ధంలో నున్న ఒక సైనికుడవు కూడాను. (చూడండి 2 కొరింథీయులకు 10:3; 1 తిమోతి 1:18, 19; 6:12.)

సైన్యపు దృష్టాంతం సరైనదే ఎందుకంటే మీరు ఆత్మీయ పోరాటాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఇది తెలియజేస్తుంది. దేవుని సైనికునిగా, మీరు సాతాను సైన్యాన్ని ఓడించేందుకు సిద్ధపడుతున్నారు. సైనికుని జీవితం కష్టతరంగా ఉంటుంది. స్థిర విశ్వాసిగా మీరు ఉండాలంటే సాతానుడి సవాళ్ళకు ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలి.

## సిద్ధపాటు

సైనికులు యుద్ధం కోసం సిద్ధపాటు కలిగియుండాలి. సిద్ధపాటు లేని సైనికునికి ఓటమే గాని విజయం రాదు. ఆత్మీయ పోరాటం నిమిత్తం ప్రభువు తన సైన్యానికి కొంత సామాగ్రిని అందిస్తున్నాడు. క్రైస్తవ సైనికునికి అవసరమగు సిద్ధపాటు గురించి పౌలు 6:10–20లో చెప్తున్నాడు. మీరిప్పుడు దేవుని సైన్యంలో ఉన్నారు. పాపాన్ని జయించేందుకు మీరిలా సిద్ధపడండి.

**దేవుని ఆజ్ఞలను అనుసరించేందుకు తీర్మానించుకోండి (6:10, 11ఎ)**

యుద్ధ సమయంలో ఆజ్ఞలను ఖచ్చితంగా పాటించాలి. ఆజ్ఞలను పాటించని వారు యుద్ధంలో చనిపోతారు. వారి నిర్లక్ష్యం తన సైన్యంలోని ఇతరులకూ ముప్పును తెస్తుంది. ఇదే సత్యం క్రైస్తవ సైనికుని విషయంలోనూ జరుగుతుంది. మీరు దేవుని ఆజ్ఞ క్రింద ఉన్నారు. ఆయన ప్రతి ఆజ్ఞను జాగ్రత్తగా అనుసరించాలి. విధేయులైతే ఆయనయందు బలవంతులై యుంటారు (10వ వచనం; చూడండి ఎఫెసీయులకు 1:19–23). ఆ బలము ఆయనతో సన్నిహిత సంబంధం కలిగియుండడం ద్వారా వస్తుంది.

దేవుని ఆజ్ఞలను అనుసరించేందుకు మీరు "దేవునిలో బలవంతులై యుండాలి." దేవుని సర్వాంగ కవచాన్ని ధరించుకొనక ముందే మీరు బలవంతులై యుండాలి (చూడండి ఎఫెసీయులకు 3:16). అంతరంగ తీర్మానం బలంగా లేకుండా బాహ్య కవచం వ్యర్థంగా ఉంటుంది. మీరు ప్రభువు యొక్క మహా శక్తిని బట్టి ... బలవంతులైయుంటేనే మీరు ఆత్మీయ పోరాటంలో పోరాడగలరు. మీరెంత బలంగా నున్నారు? దేవునిలో మీ సమర్పణ ఎంత బలంగా ఉంది? దేవుని సత్యం విషయమై మీ భావాలు ఎంత బలంగా నున్నాయి?

అనేకమంది క్రైస్తవులు అంతరంగ పురుషుని బలపరచకుండా సర్వాంగ కవచాన్ని ధరించుకోవాలనుకుంటారు. మీ అంతరంగ పురుషుడు ఎంత బలంగా నున్నాడు? మీరు కూడా పౌలు చెప్పినట్లే చెప్పాలి, "మా బాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్యపురుషుడు దినదినము నూతన పరచబడుచున్నాడు" (2 కొరింథీయులకు 4:16).

**మీ శక్తి మీద దృష్టియుంచండి (6:11బి–13)**

దేవుని సైనికునిలా మీకు ఒక గొప్ప లక్ష్యం ఉంది: "అపవాది తంత్రములను ఎదురించడం." దేవుని నుండి వెనుదిరిగి తిరిగి పాపం చేయుటకు సాతానుడు మిమ్ములను శోధిస్తాడు. అయితే మీ శక్తిని దేవుని మీద ఉంచాలి. తద్వారా మీరాయనయందు బలవంతులవుతారు. తిరిగి పాపం చేసేందుకు తంత్రాలను సాతాను ఉయోగిస్తాడు. మీలోని బలహీనతలపై అతడు తంత్రములను ప్రయోగిస్తాడు.

"అపవాది తంత్రములను ఎదిరించుడి" అన్న వాక్యం దేవుని యెడల మీ సమర్పణకు వ్యతిరేకంగా సాతాను పని చేస్తున్నాడని వివరిస్తుంది. మీ ఉపకరణములను నాశనం చేయాలని వాడు చూస్తున్నాడు. ఈ ఆత్మీయ పోరాటంలో మీరు అతడ్ని ఎదిరించాలి. మీరు సిద్ధపడి దేవుని యందు నమ్మకంగా ఉంటే సాతాను తంత్రాలు మిమ్మల్నేమీ చేయలేవు (చూడండి కీర్తనలు 1; 19:14). అనేక మంది క్రైస్తవ సైనికులు దేవుని సత్యం మీద దృష్టియుంచకపోవడం వలన ఆత్మీయ పోరాటంలో గాయపడుచున్నారు అటువంటి వారిలో ఫైగెల్లు, హెర్మోగెనే (2 తిమోతి 1:15), హూమనైయును, ఫిలేతును (2 తిమోతి 2:17, 18), అలెక్సంద్ర అనుకరించరివాడు (2 తిమోతి 4:14, 15), మరియు దేమా (2 తిమోతి 4:10) ఉన్నారు.

**క్రైస్తవ సైనికునిగా వస్త్రధారణ కలిగియుండండి (6:14–17)**

మంచి క్రీస్తు యోధునిగా ఉండేందుకు మీరు "దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకోవాలి" (11, 13 వచనాలు). యుద్ధం విషయమై క్రైస్తవునికి ఇది తప్ప వేరే

అవకాశం ఏదీ లేదని పౌలు మాటలు చెప్తున్నాయి. మీరు పోరాటంలో పాల్గొనాలి, ఈ వాక్యం దాని అత్యవసరతను తెలియజేస్తుంది. మీ అంతరంగ సిద్ధపాటు పూర్తయ్యాక, బాహ్యాపరంగా కవచాన్ని ధరించుకోవాలి.

బాహ్య భద్రత నిమిత్తం దేవుడిచ్చే వాటిని పౌలు దైవావేశుడై వివరిస్తున్నాడు. ఈ ఉపకరణములు క్రైస్తవుని అంతరంగ బలానికి తోడుగా ఇయ్యబడ్డాయి. మీరు పోరాటంలో ఉన్నారు. కాబట్టి ప్రతి దినమూ పోరాటం జరుగుతూనే ఉంటుంది. సాతాను, అతడి అంధకార ఆత్మలు మీ భావాలను, తీర్మానాలను ఏమార్చేందుకు యత్నిస్తుంటారు. మీ మతాన్ని ప్రదర్శించేందుకు, మీ విశ్వాసాన్ని హృదయం నుండి గాక పై పెదవునుండి చెప్పేందుకు అతడు యత్నిస్తుంటాడు. మీరు అస్థిరంగా ఉండేలా శోధించి తద్వారా మీ బలహీనతలు మీకు ఫర్వాలేదనిపించి, స్వార్థం వచ్చేలా చేస్తాడు.

మీ విశ్వాసం కాపాడుకునేందుకు, మీ ఆత్మీయత భద్రంగా ఉండేందుకు మీరు "దేవుని సర్వాంగ కవచమును" ధరించుకోవాలి. ఇందులోని ప్రతి ఉపకరణం మీకు ఎలా ఉపకరిస్తుందో, మీరు రాజీలేని విశ్వాసంతో ఉండేలా చేస్తుందో చూడండి.

*సత్యమును దట్టి.* పౌలు దినాల్లో సైనికులు తమ వదులైన వస్త్రాలు బిర్రుగా ఉండేందుకు "దట్టిలను" కట్టుకునేవారు. తద్వారా వారి గురి చెదరదు. సైనికునికి తన దుస్తులు దట్టితో కట్టబడియుండడం ద్వారా అతడు స్వేచ్ఛగా తిరగగలడు. ఇదే దట్టి యుద్ధ సమయంలో సైనికునికి బలంగా, ఆధారంగా ఉంటుంది. సాంకేతికంగా, ఈ దట్టి కవచంలో భాగం కాదు. నిజానికి మొదట ఈ దట్టిని ధరించి తద్వారా వస్త్రములు జారిపోకుండా కట్టబడిన తరువాత కవచమును ధరిస్తారు. ఇది ముఖ్య విషయం. క్రైస్తవుడు సత్యముచేత కట్టబడియున్నాడని సరిచూసుకోవాలి లేదంటే అతడు ఆత్మీయ పోరాటంలో కవచమును ధరించలేడు. దేవుని సత్యం అన్నిటిని కలిపి కట్టియుంచి మీరు వాక్యంలో స్థిరంగా నిలబడేలా చేస్తుంది సత్యమునకు కట్టుబడి యుంటే అస్థిరత్వం ఉండదు (ఎఫెసీయులకు 4:14, 15) అలాగే పోరాటంలో తప్పులు చేయకుండా చేస్తుంది (సామెతలు 20:28; గలతీయులకు 4:16).

*"నీతియను మైమరువు."* కవచంలోని ఈ భాగం సైనికుని పై భాగం యొక్క ప్రధాన భాగాలను కప్పియుంచుతుంది. ఇది నీతిని, క్రైస్తవుని దైవిక క్రియలను సూచిస్తుంది. నీతిగా ప్రవర్తింపని వారు భద్రంగా ఉండలేరు (చూడండి ఫిలిప్పీయులకు 1:11; తీతు 2:11, 12) మీ జీవితంలో నీతి ఉంటే మీరు పాపంలో చిక్కుకోలేరు.

*"సమాధాన సువార్తవలనైన సిద్ధమనస్సుయను జోడును."* సైనికులకు పాదరక్షలు మరో అవసర ఉపకరణం. మంచి జోళ్ళు లేకుండా అతడు యుద్ధరంగంలో ఉత్సాహంగా పోరాడలేడు. రోమీయుల చెప్పులలో మేకులను క్రిందకు దిగగొట్టేవారు. వాటి ద్వారా ఎటువంటి నేలమీదనైనా సులభంగా నడువగలరు. దేవుని సైనికుడు కూడా సిద్ధమనస్సు కలిగియుండేలా సిద్ధపడాలి. సువార్తను ఎరిగి ఉండడం ద్వారా క్రైస్తవ సైనికుడు పోరాటంలోనూ స్థిరంగా, సిద్ధంగా ఉండగలడు.

*"విశ్వాసమను డాలు."* రోమా సైనికుడు. శత్రువులు విసిరే నిప్పుల బాణములనుండి తన్నుతాను కాపాడుకునేందుకు పెద్ద డాలును వాడేవారు. ఈ బాణములు సూదిగా చిన్నగానే ఉండేవి. అయితే ప్రమాదకరమైన వాటిని ఎదుర్కొన్నప్పుడు, బాణం దిగగానే డాలుకు చిన్న ప్రమాదం మాత్రం జరిగేది. క్రైస్తవునిగా నీవు సాతానుకు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు

మీ విశ్వాసాన్ని దెబ్బతీసే అనేక ప్రమాదాలు ఎదురవుతాయి. సిద్ధాంతాలు, రక్షణ, దేవుని ప్రేమ, ఇతర విషయాల గురించి ప్రశ్నలు తలెత్తుతాయి. ఆ ప్రశ్నలు మీ అభిప్రాయాలను దెబ్బతీస్తాయి అవి డాలులో దిగబడితే అవి సందేహంగా, సంశయంగా మారి మీ విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. సాతానుతో మీ పోరాటంలో మీరు మీ విశ్వాసమను డాలును వాడాలి. అప్పుడు ఏ సందేహాలు దెబ్బతీయలేవు. విశ్వాసమను డాలు ద్వారా మీరు దేవున్ని పూర్తిగా నమ్ముతున్నారు. ఈ నమ్మకం దుష్టుని అగ్ని బాణములను విరుగగొడుతుంది (చూడండి కీర్తనలు 3:3, 4; 33:20; 84:11). దేవుని యందలి విశ్వాసం విశ్వాసికి బలాన్నిస్తుంది (సామెతలు 29:25).

*"రక్షణయను శిరస్త్రాణము."* పురాతన సైనికులు మరింత భద్రత కోసం శిరస్త్రాణమును వాడేవారు. శిరస్సే దేహానికి, జీవితానికి, నిర్ణయాలకు మూలం. అటువంటి శిరస్సుకు భద్రత లేకుంటే మరణం త్వరగా సంభవిస్తుంది. దేవుని సైనికునిగా నీ ఆలోచనలను భద్రపర్చుకోవాలి (చూడండి రోమీయులకు 8:6; 2 కొరింథీయులకు 10:5). మీ ఆలోచనను ఆయన మీద వేసి, ఏది మంచిదో ఏది చెడో యోచించండి. మీ ఆలోచనలు దేవుని మీదనున్నప్పుడు మీకు సమాధానం దొరుకుతుంది. టి.విలో విద్యకు సంబంధించిన ఒక ప్రకటన "మనస్సును వ్యర్థం చేయడం భయంకర విషయం" అని ఇచ్చారు. దీన్ని సంఘ విషయంలో చెప్తే, "మనస్సు భద్రంగా ఉంచకపోవడం ప్రమాదం" అని చెప్పవచ్చు.

*"ఆత్మ ఖడ్గము."* క్రైస్తవ సైనికుడు ఉపయోగించే ఏకక ఆయుధం దేవుని వాక్యం అను ఖడ్గము. సాతాను శోధించినప్పుడు యేసు ప్రభువు దీన్నే ఉయోగించారు (చూడండి మత్తయి 4:4, 7, 10). సాతాన్ను ఓడించేందుకు మరింకేం ఆయుధాలు అవసరం లేదు. నిజానికి మరేవిధమైన ఆయుధాన్ని ఉయోగించినా నిష్ఫలం. క్రైస్తవునికి ఉన్న ఒకే ఒక్క ఆయుధం వాక్యం కాబట్టి అతడు దాన్ని సరిగా ఉపయోగించాలి. ఒక వ్యక్తి దానిని ఎలా వాడాలో తెలియనప్పుడు అతడు ఎలా యుద్ధం గెలుస్తాడు? మీరు వాక్య పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి అప్పుడు ఆయుధాన్ని నేర్పుగా వాడడం నేర్చుకుంటారు (2 తిమోతి 2:15). వాక్యాన్ని సరిగా ఉపయోగించినప్పుడు మీరు సాతాన్ను గెలుస్తారు (కీర్తనలు 119:9, 11). "దేవుని వాక్యం సజీవమై, బలముగలదై రెండంచుల గల ఎటువంటి ఖడ్గము కంటెను వాడియైయున్నది" (హెబ్రీయులకు 4:12). సాతానుడి అబద్ధాల మీద దేవుని సత్య వాక్యం గెలుస్తుంది.

## మీ దళ నాయకునితో ఎల్లప్పుడూ సంభాషిస్తూ ఉండండి (6:18-20)

ఇదివరకటి కాలంలో యుద్ధరంగంలో ఒకానొక పొరపాటు ఏంటంటే దళ నాయకుడు తన సైనికులతో సంభాషించకపోవడం. ఇదే సమస్య నవీన యుద్ధాల్లోను కనబడుతుంది. నాయకునికి, సైనికులకు సంభాషణ నడవకుంటే ఘోరం జరుగుతుంది. ఇది క్రైస్తవులు మరియు సాతాను మధ్య యుద్ధంలోనూ నిజమే! మీరు సాతానుతో, అతని దురాత్మలతో పోరాడుతున్నప్పుడు మీ నాయకునితో సంభాషణా సంబంధం కలిగియుండాలి. ఆ సంభాషణ పరలోక తండ్రితో చేసే ప్రార్థన.

గ్రీకులో ఈ మాటకు "ప్రార్థనను చేయుచు" అని ఇయ్యబడింది. ఇది జరుగుతుండేవని అంటే సర్వాంగ కవచాన్ని ధరించుకున్న తరువాత ప్రార్థన చేస్తూనే యుండాలి. క్రైస్తవుడు కవచధారి అయ్యాక ప్రార్థన కొనసాగుతుంటుంది. దీన్ని బట్టి ఆత్మీయ పోరాటంలో ప్రార్థన

ఎంత అవసరమో అర్థమవుతుంది.

సైనికుడు సర్వాంగ కవచాన్ని ధరించుకున్నా, తన హృదయం సిద్ధంగా ఉన్నా, తన నాయకునితో సరైన కమ్యూనికేషన్ లేకుంటే అపజయం ఎదురవుతుంది. ప్రార్థన నిశ్చయత ఆత్మ విశ్వాసాన్ని ఇస్తుంది. క్రైస్తవునిగా నీకున్న ప్రధాన విషయాల్లో ఒకటి మెలకువ కలిగి ప్రార్థించడం. అది నీ ఆత్మీయ పోరాటంలో ఉపకరిస్తుంది. క్రైస్తవునికి ఇవి అవసరం ...

- ప్రతి విషయమై దేవునితో సంభాషించే ప్రార్థన జీవితం ("అన్ని వేళలా").
- దేవుని చిత్తాన్ని అనుసరించే ప్రార్థన జీవితం ("ఆత్మలో").
- వేటి గురించి ప్రార్థించాలో ఎరిగియుండే ప్రార్థన జీవితం ("మెలకువ").
- ఎన్నడూ ఆగని ప్రార్థన జీవితం ("ఎడతెగక").
- దేవుని ప్రణాళికలో సహకరించే ప్రార్థన జీవితం ("ధైర్యంగా మాట్లాడడం").

మీ ప్రార్థనా జీవితం స్థిరంగా ఉందా? ఎడతెగక ప్రార్థిస్తున్నారా (1 థెస్సలొనీకయులకు 5:17)? మీ పరలోక తండ్రితో స్థిర సంబంధం కలిగి సాతానును ఓడిస్తున్నారా?

## విజయము

మీరు క్రైస్తవులైనప్పుడు మీ జీవితంలో గొప్ప పోరాటంలో మీరు ప్రవేశించారు. మీ ఆత్మ యొక్క గమ్యం మీ పోరాట ఫలితం మీద ఆధారపడి యుంటుంది. ఈ పోరాటానికి మీరు సిద్ధమేనా? దేవుడిచ్చిన సర్వాంగ కవచాన్ని ధరించుకున్నారా? పోరాటాన్ని గెలిచేందుకు ప్రార్థనా సహాయం తీసుకున్నారా? కొంత మంది క్రైస్తవులు ఓడిపోవడానికే దీనిలోకి వస్తుంటారు. వారు సాతానుకు లొంగిపోవడం అనేది లోకంలోకి తిరిగి వెళ్ళిన దేమా వంటి పరిస్థితే (2 తిమోతి 4:10). కొంతమంది యుద్ధంలో పోరాడి అలసిపోతుంటారు (చూడండి గలతీయులకు 6:9). క్రీస్తు అనుచరులందరూ ఆత్మీయపోరాటంలో సాతాను చేజిక్కకుండా ఉండేందుకు తీర్మానించుకోవాలి (చూడండి ప్రకటనలు 2:10).

మీరిప్పుడు క్రైస్తవులు "మంచి విశ్వాస పోరాటము పోరాడండి"! (1 తిమోతి 6:12).